
వాడు ఓ మిస్ అప్రాప్రియేషన్ కేసులో ఇరుక్కున్నాడు. వాడు అలాంటి వాడు కాదని నాకు బాగా తెలుసు. ఎవరో కన్ను కుట్టిన వాళ్ల పనై ఉంటుంది. వాడు తన జేబులో తన డబ్బుంటేనే ఆఫీసు బయట రంగమ్మ బడ్డీలోని టీ తాగుతాడు లంచ్ టైంలో. లంచ్‌లో మే మందరం తింటే వాడు తాగుతాడని జోక్‌గా చెప్పుకొంటూండే వాళ్లం. వా డంటే ఈర్ష్య పడని వా ళ్లెవ్వరూ లేరు మా ఆఫీసులో, నేను తప్ప! ఎందు కంటే వాడు నా చిన్నప్పటి స్నేహితుడు. ఒకే బడిలోచదువుకున్నాం. వాడి నాన్న మా ఊరికి కరణం.




వాడు పట్నం వెళ్లి డిగ్రీలో చేరాడు. నేను కొన్ని ముఖ్య కారణాల వల్ల పై చదువులకు వెళ్ల లేక పోయాను. పెళ్లి చేసుకొని తాలూ కాఫీసులో గుమాస్తాగా చేరి పోయాను.

వాడు నా కంటే ఎర్రగా బుర్రగా ఉంటాడు. జీన్స్ పేంట్‌పై జర్కినులు వేసి ఆఫీ సు కొస్తే పెళ్లయిన ఆడ వాళ్లు కూడా వాడిని కన్నార్ప కుండా చూస్తారు. పెళ్లి కాని వాళ్ల యితే పడి చస్తారు వాడంటే. వాడి స్మార్ట్‌నెస్ కన్నా వాడి నీతి నిజాయితీలకు అని అమ్మాయిలు అనుకొంటుంటారు.

ఓ రోజు ఉన్నట్టుండి హుటాహుటిని హెడ్ ఆఫీసు నుంచి ఆడిట్ పార్టీ రావడం, ఓ రెండు రాత్రులు వాడి ఫైల్స్, బ్యాంక్ అకౌంట్లు, చాలా న్స్ వగైరాలు తనిఖీ చేసి, గంటల తరబడి మా ఆఫీసరుతో మాట్లాడి, వాణ్ని డిస్‌మిస్ చేశారు- 'నువ్వు సెక్షన్ ఆఫీసర్వి, ఇదంతా నీ వ్యవహారమే. ఈ కుంభకోణంలో ఆఫీసరు ప్రమేయ మేమీ లే' దని కేసు బనాయించాక, ఆడిట్ వాళ్లు వెళ్లి పోయారు.

"వీడు జన్మతః సిల్వర్ స్పూన్‌తో పుట్టాడు సార్! డబ్బుకు వీడు కక్కుర్తి పడడు. అసలు వీడికి ఉద్యోగం చేయాల్సిన అవసరం కూడా లేదు. ఏదో సరదా కోసం చేస్తున్నాడు" అని మా ఆఫీసరుతో బాగా మాట్లాడాను. కాని ఆఫీసరు పెడచెవిని పెట్టాడు నా మాట లన్నీ. నా ప్రయత్నా లన్నీ వమ్ము చేశాడు.

★ ★ ★

చివరికి వాడిని ఒప్పించి న్యాయ స్థానాని కెళ్దా మని పట్నంలో పేరున్న ఓ గొప్ప లాయర్ దగ్గరికి తీసుకెళ్లాను.

లాయర్స్ మీద మా వాడికి నమ్మకం లేదు. "డబ్బు దుబారా ఖర్చు. అయిందేదో అయి పోయిందిగా! నాకు ఉద్యోగం అవసరాలలో ఒకటి కానే కాదు. హాయిగా బిజినెస్ పెట్టుకొంటాను. అయినా ఈ లాయర్స్ మీద నాకు మంచి అభిప్రాయం కూడా లేదు. చంపిన వాడి వైపునున్న వారికి, చంపబడ్డ వాడి వైపున్న వారికి 'నీ కేసు నెగ్గుద్ది' అనే ధైర్యం వకీళ్లు ఇస్తుం టారు. కాని న్యాయం మాత్రం ఏ ఒకరి వైపునో ఉంటుంది...!" అంటూ ఓ చిన్న పాటి లెక్చర్ దంచాడు.

"ఒరేయ్ బడుద్దాయ్, నీ పేరు బదనామ్ అయి పోద్ది . నువ్వు రాబోయే నీ భార్యకు లోకు వై పోతావ్! సో ... నువ్వు లాయర్‌ను సంప్రదిం చాల్సిందే!" అని పట్టు పట్టాను.

అనిష్టంగానే వాడు నా వెంట వచ్చి లాయర్‌తో సంప్రదించాడు. గంటన్నర సేపు ఆఫీసరుతో పాటు ఆఫీసు వాళ్లు ఆడిన నాటకం గురించి వివరంగా చెప్పాం.

అంతా విని "ప్రభుత్వం చేస్తూన్న కేసులో దమ్ము లేదు!" అని చెప్పాడు లాయర్ లావుపాటి చుట్ట తాగుతూ, దట్టంగా పొగ వదుల్తూ.

పొగ మధ్యలో దగ్గు తెరతో "నా తలపై యాభై వేల రూపాయల ఘప్‌లా కేసును రుద్దు తున్నారు. మీరు చెబుతున్నట్లుగా ఈ ఊబిలో నుంచి బయట పడటానికి నా దగ్గర లక్ష రూపాయ లున్నాయి" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న వాడికి, లాయర్ గారు మధ్యలో నుంచే నోట్లోంచి తన చుట్టను బయటికి తీస్తూ - "ఇన్ని రూపాయలు నీ దగ్గర ఉండగా నువ్వు జైలు కెళ్ల లేవోయ్!' ' అని అన్నాడు కుర్చీలో నుంచి లేచి నిలబడుతూ.

లాయర్ గారికి కొంత ముట్టజెప్పి, షేక్ హాండ్లిచ్చుకున్నాక ఇండ్లకు చేరుకున్నాం.

కొన్నాళ్లకు తెలిసింది, లాయరు నిజమే చెప్పాడని!

వా డెప్పుడైతే జైలు కెళ్లాడో వాడి దగ్గర చిల్లి గవ్వ లేదు!